పుస్తక పరిచయం

# 'ఇండియా ఈజ్ బ్రోకెన్'

('ఏ పీపుల్ బిట్రేడ్, ఇండిపెండెన్స్ టు టుడే' రచన అశోకా మోడీ )

కొమరయ్య

**గత** కొద్ది నెలలుగా ప్రధాని మోడీ జి-20 వంటి వివిధ అంతర్జాతీయ వేదికలపై నుండి 'భారతదేశం ప్రజాస్వామ్యానికి తల్లి వంటిద'ని మాట్లాడుతూ వస్తున్నాడు. భారతదేశంలో ఎన్నికలు క్రమం తప్పకుండా నిర్వహించడం జరుగుతున్నదని చెబుతూ, క్రమం తప్పక, ఎన్నికల నిర్వహణనే ప్రజాస్వామ్యంగా పేర్కొంటున్నాడు.

మరోవైపున, 2047 సంవత్సరానికి భారతదేశం 30 ట్రిలియన్ డాలర్లతో ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చెందబోతోందని ప్రగల్భాలు పలుకుతున్నాడు. అయితే, ఎవరి ప్రయోజనాల కోసం ఈ విధమైన అతిపెద్ద ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేయబోతున్నారనే అంశాన్ని మాత్రం మరుగుపరుస్తున్నాడు.

ప్రభుత్వ నాయకత్వాన్ని ఎన్నుకునేందుకు ఇప్పుడు తిరిగి మరోసారి మన దేశంలో సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్నాయి. మరోసారి తిరిగి ప్రభుత్వ అధికారాన్ని చేజిక్కించుకునేందుకు మోడీ నాయకత్వంలోని బిజెపి పాలకులు, ఓటర్లకు తప్పుడు, డొల్ల, శుష్క వాగ్దానాలు చేస్తూ... ప్రతి అవకాశాన్నీ వినియోగించుకునే ప్రయత్నం చేస్తున్నారు. పైగా కుప్పకూలటానికి సిద్ధంగా ఉన్న భారత ఆర్థిక వ్యవస్థను కాపుగాసే రక్షకులు తామే అయినట్లుగా వారు తప్పుడు ప్రకటనలు చేస్తున్నారు. భారత ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవల పార్లమెంటులో ప్రవేశపెట్టిన శ్వేత పత్రం గురించి మాట్లాడారు. దేశ ప్రతిష్టను పునరుద్ధరించే దృష్టితో, ప్రధాని ఎలాంటి ప్రయత్నం చేపట్టారో యావత్ భారతదేశ యువజనులందరూ ఈ సందర్భంగా తప్పని సరిగా తెలుసుకోవాలన్నారు. అయితే భారతదేశ ఏ ప్రతిష్టను బిజెపి ప్రభుత్వం పునరుద్ధరించిందో ప్రత్యేకించి పేర్కొనకుండా మాట్లాడారు.

మోడీ, బిజెపిల ప్రకటనలు ఏమైనప్పటికీ, స్వాతంత్ర్యం వచ్చిందని చెప్పబడుతున్న ఈ 75 సంవత్సరాల తర్వాత ఖచ్చితంగా యువజనులందరూ ప్రత్యేకించి, విద్యావంతులైన మధ్య తరగతి యువత, మన దేశంలో ఇన్ని సంవత్సరాలుగా ఏమి జరిగిందనే దాని గురించి, వరుసగా అధికారంలోకి వచ్చిన, పాలన సాగించిన పాలకవర్గ పార్టీల, ప్రభుత్వాల పాత్ర ఏమిటనే దాని గురించి తెలుసుకోవాలి. అలాగే, భారతదేశాన్ని విచ్ఛిన్నం చేసిన, ప్రజలను వంచనకు గురిచేసిన స్వాతంత్ర్యాన్ని... కేవలం ఎన్నికల అధికార స్వామ్యంగా కుదింపజేసిన, పాలకుల ఆర్థిక విధానాల గురించి తప్పక తెలుసుకోవాలి... నేర్చుకోవాల్సి ఉంది.

'ఇండియా ఈజ్ బ్రోకెన్' పుస్తకంలో దేశ ఆర్థిక వ్యవస్థను విశ్లేషించటం ద్వారా అశోకా మోడీ...గత 75 సంవత్సరాల స్వతంత్ర ఆధునిక భారతదేశ చరిత్రను మరోసారి సింహావలోకనం చేసే అవకాశం కల్పించారు. 25 సంవత్సరాలు ఐఎంఎఫ్‌కు అంతర్జాతీయంగా సేవలందించిన వాడిగా, విద్యావంతుడుగా, ఒక క్రమశిక్షణాయత వైఖరితో...ఆయన భారతదేశ ఆర్థిక వ్యవస్థను 'ఇండియా ఈజ్ బ్రోకెన్' పుస్తకం ద్వారా మన ముందుంచారు.

ఈ సందర్భంలో, సీనియర్ మార్క్సిస్ట్-లెనినిస్ట్, విప్లవ కమ్యూనిస్టు నాయకుడు కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డిని స్మరించుకొని తీరాలి. స్వాతంత్ర్యం తర్వాత 25 సంవత్సరాల భారత ఆర్థిక వ్యవస్థను ఇప్పటికే ఆయన వివరంగా విశ్లేషించి ఉన్నాడు. అంతేకాదు, ఈ ఆర్థిక వ్యవస్థ గమనం, మార్గం ఏ దిశగా సాగుతున్నాయో, అవి ఎక్కడికి దోవతీస్తాయో కూడా వివరిస్తూ 'ఇండియా మార్ట్‌గేజ్డ్' (తాకట్టులో భారతదేశం) అనే తన ప్రఖ్యాత కోర్టు ప్రకటన ద్వారా, చుట్టుముట్టనున్న పర్యవసానాలను ఒక శాస్త్రీయ వైఖరితో ముందుగానే ఆయన విశ్లేషించి ఉన్నారు.

విచ్ఛిన్నమయ్యే పరిస్థితి నుండి భారత ఆర్థిక వ్యవస్థను బయట పడేసేందుకు ఎలాంటి ప్రయత్నమూ జరగలేదని కామ్రేడ్ టిఎన్ చేసిన హెచ్చరికలను ఎవరూ పరిగణలోకి తీసుకోలేదు. ఈనాడు భారత ఆర్థిక వ్యవస్థ మొత్తంగా విచ్ఛిన్నమై ఉంది.

నిర్మలా సీతారామన్ పేర్కొన్న విధంగా, ప్రధాని మోడీతో సహా ఎవరి ప్రయత్నాలు కూడా, దేశ కీర్తి ప్రతిష్టలను పునరుద్ధరించటం లేదు. భారత ప్రజల, భారత దేశ గొప్ప కీర్తి ప్రతిష్టల పునర్నిర్మాణాన్ని వీరంతా వదిలివేశారు. ఇది ఈనాటి చేదు నిజం, వాస్తవం కూడా!

అమెరికా పౌరసత్వం కోసం, తన భారత పౌరసత్వాన్ని వదులుకున్న అశోకా మోడీ, అంతర్జాతీయ స్థాయిలో ఆర్థిక రంగంలో సేవలు అందించాడు. భారతదేశ ఆర్థిక వ్యవస్థ యొక్క చరిత్రను, నయా ఉదారవాద వైఖరి యొక్క క్రమశిక్షణతో, భారతీయ హృదయంతో ఆయన విశ్లేషించారు. కామ్రేడ్ టి ఎన్ 'ఇండియా మార్ట్‌గేజ్డ్' ప్రకటన చేసిన 50 సంవత్సరాల తర్వాత అశోకా మోడీ 'ఇండియా ఈజ్ బ్రోకెన్' లో చేసిన నిర్ధారణలూ- భారత ఆర్థిక వ్యవస్థను, స్వాతంత్ర్యం తర్వాత నుండి ఆనాటి వరకు జరిగిన కీలకమైన రాజకీయ ఘటనలను సవివరంగా పరిశోధన చేసిన తర్వాత కామ్రేడ్ టిఎన్ చేసిన వక్కాణింపులు, నిర్ధారణలూ...ఒకే విధంగా ఉన్నాయి.

అశోకా మోడీ...పాలకులు చేపట్టిన ఆర్థిక విధానాలను, వాటి పర్యవసానాలను, భారతదేశంలో సంభవించిన దాదాపు అన్ని కీలక ఘటనలను (బహుశా పొరపాటున కొన్నింటిని పేర్కొనకపోయినా) స్పృశిస్తూ భారతదేశ చరిత్రను స్పష్టంగా వివరించారు. క్రమం తప్పక ఎన్నికలు జరపటం, శాంతియుతంగా

అధికార మార్పిడి వంటివి ప్రజాస్వామ్య ఆరోగ్యానికి తగిన సూచికలుగా అశోకా మోడీ భావించలేదు. భారత ప్రభుత్వాన్ని పరిపాలించిన నాయకులంతా బూర్జువా, భూస్వామ్య వర్గాల ప్రతినిధులనే అవగాహనపై ఆధారపడి ఆర్థిక వ్యవస్థ, దేశ చరిత్రల గురించిన ఆయన విశ్లేషణలు సాగాయి. ఈ పుస్తకంలోని కీలకాంశం ఏమంటే, భారత పాలకులకు, శాసనకర్తలకు అన్నింటికీ మించిన ఒక ముఖ్య కర్తవ్యం ఉందన్నారు : అదేమంటే, విస్తార జన బాహుళ్యానికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించడం, మంచి ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వ వనరులు తప్పనిసరి అని, అలాగే విద్య, ఆరోగ్యం, సరైన న్యాయవ్యవస్థ, స్వచ్ఛమైన పర్యావరణం... వంటివి మానవ సంక్షేమానికి తప్పనిసరి అని, ఆయన నమ్ముతూ వక్కాణించి చెప్పారు. ప్రభుత్వ వనరులనేవి ఆర్థిక వ్యవస్థను మరింత ఉత్పాదకతతో రూపొందించి, అందరికీ ప్రయోజనకరమైన పెరుగుదలకు ఆధారాన్ని సృష్టిస్తాయనే గాఢమైన అభిప్రాయాన్ని ఆయన కలిగి ఉన్నారు. అలాగే ప్రాతినిధ్య ప్రజాస్వామ్యాలు పనిచేయవని, ఎందుచేతనంటే... సంపద, విశేష అధికారాలు కలిగిన వారు, ఎన్నికల ఫలితాలను తమ సంకుచిత లక్ష్యాలతో, అత్యధికుల ప్రయోజనాలను నిర్లక్ష్యం చేసే విధంగా, తమ డబ్బు అధికారాలతో ప్రభావితం చేస్తారన్నారు. ఆ విధంగా ఆకర్షణ గల రాజకీయ నాయకులు సాధారణ జవాబుదారీతనాన్ని తప్పించి సహజ వనరులను వారి ప్రయోజనాలకు అనుకూలంగా ఉపయోగించు కునేందుకు అనుమతిస్తారనే అభిప్రాయాన్ని కూడా ఆయన కలిగి ఉన్నారు. ఈ విధమైన దృక్పథంతో అశోకా మోడీ 'ఇండియా ఈజ్ బ్రోకెన్' అనే తన ఈ పెద్ద పుస్తకంలో ముగింపు నిర్ధారణలను ఈ విధంగా పేర్కొన్నారు. వాటి సారాంశం క్లుప్తంగా ఇలా ఉంది:

స్వాతంత్ర్యానంతర చరిత్రలో నెహ్రూ నుండి మోడీ శకం వరకు, 75 సంవత్సరాల పరిశీలనను ప్రారంభించే ముందు, వ్యవసాయ రంగంలో నూతన ప్రక్రియను ప్రారంభించడం, పట్టణ ప్రాంతాలలో మంచి ఉద్యోగాలను కల్పించడం, అంతర్జాతీయ మార్కెట్లో పోటీ పడటం అనే మూడు సవాళ్లను భారతదేశం ఎదుర్కొందన్నారు. అసమాన సమాజంగా భారతదేశం ప్రారంభమైందని, అసమానత్వం అధికమవుతూ భారతదేశ సంపన్నుల-పేదల మధ్య అగాధం భయంకరంగా పెరిగి పోయిందని, భారతదేశ పేదరికం సమకాలీన మానవీయ జీవన ప్రమాణాల ప్రకారం పరిశీలిస్తే 60 శాతం భారతీయులు పేదలుగా ఉన్నారన్నారు. అత్యంత పొదుపు ప్రమాణాల ప్రకారం మాత్రమే పరిశీలిస్తే 1980ల చివరనుండి ప్రారంభమైన దాదాపు రెండున్నర దశాబ్దాల కాలంలో భారతదేశ పేదరికం మరింతగా పెరిగిందని, కోట్లాది మంది భారతీయుల ఆర్థిక ఆకాంక్షలు, దేశంలోని ప్రజాస్వామ్యం ఇక ఎంతో కాలం భారతీయుల ప్రాథమిక హక్కులను స్వేచ్ఛలను రక్షించలేవని, సమానత్వం, సహిష్ణుత, అభివృద్ధి పంపకం అనేవి అదృశ్యమయ్యాయని ఆయన విశ్లేషించారు

భారతదేశం ఆశాభావంతో ప్రారంభమైంది. అయితే దేశం ఈ ఆశలను నెరవేర్చుకోగలిగిందా, లేక విచ్ఛిన్నమైన దేశ ఆర్థిక వ్యవస్థను, ప్రజాస్వామ్యాన్ని మరమ్మత్తు చేసుకోలేనంత ఆలస్యమైందా అని అశోకా మోడీ ప్రశ్నించారు. 75 సంవత్సరాల భారత ఆర్థిక వ్యవస్థను, దాని పర్యవసానాలను విశ్లేషించిన తర్వాత అశోకా మోడీ చేసిన నిర్ధారణలు ఈ విధంగా ఉన్నాయి : కష్టతరమైన దీర్ఘకాలిక విధానపర మార్పులను తప్పించాలని అనేక మంది వ్యాఖ్యాతలు కోరుతున్నారు. అయినా తేజోమయమైన భవిష్యత్తుకు ఆధునిక సాంకేతికత సహకరిస్తుందనే దానిపై పాలకులు నమ్మకం ఉంచుతున్నారు. బడ్జెట్ వనరులకు, సామాజిక కార్యాచరణకు సాంకేతికత అనేది ప్రత్యామ్నాయం కాదని అశోకా మోడీ నొక్కి చెప్పారు. మరింత దుర్మార్గంగా ఆదర్శాలు విచ్ఛిన్నమైనప్పుడు,సాంకేతికత దానికదే చట్ట విరుద్ధ ప్రయోజనాల కోసం దుర్వినియోగమవుతుందని పేర్కొన్నారు.

విస్తారంగా వివరణాత్మకంగా అశోకా మోడీ చేసిన ఈ విశ్లేషణలో ఆయన కొన్ని కీలక ఘటనలను పేర్కొనలేదు. 1.జనతా పార్టీ తన పాలనా కాలంలో పారిశ్రామిక వివాదాల చట్టాన్ని పరిశ్రమాధిపతుల ప్రయోజనాల కనుగుణంగా సవరించే ప్రయత్నం చేసింది. 2. బీహార్‌లో రణబీర్ సేన వంటి భూస్వామ్య సైన్యం ఏర్పాటు 3. బ్రిటిష్ వలస పాలన కాలం నాటి నుండే భారత కార్మిక వర్గం అనేక కఠిన పోరాటాల ద్వారా సాధించుకున్న రాజ్యాంగ బద్ధ హక్కులను కూడా నిరాకరిస్తూ మోడీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్పు చేయటం.... బహుశా ఈ అంశాలను పొరపాటున పేర్కొనకపోయి ఉండవచ్చు.

మొత్తం మీద ప్రత్యేకించి ఈ విశ్లేషణ యొక్క గమనార్హమైన అంశమేమంటే, మన దేశం మరింతగా రోజురోజుకీ విదేశీ పెట్టుబడులపై, విదేశీ రుణాలపై ఆధారపడే విధంగా తయారవుతోందని 'ఇండియా మార్ట్‌గేజ్డ్'లో కామ్రేడ్ టిఎన్ చేసిన వక్కాణింపులను, అశోకా మోడీ తనదైన తరహాలో ఆమోదించి, నిర్ధారించారు.

అమెరికా సహాయం పేరిట, పశ్చిమ దేశాలు సహాయం పేరిట భారతదేశాన్ని దోపిడీ చేస్తున్నాయని, అమెరికా సామ్రాజ్యవాద ప్రభుత్వం, దాని పాలకులు ప్రపంచ బ్యాంకుల ఆదేశాల ప్రకారమే దేశ ఆర్థిక విధానాలు, బడ్జెట్ ప్రణాళికలు చేపట్టి తీరాలని బలవంత పెడుతూ ఒత్తిడికి గురిచేస్తున్నారని, అమెరికా పిఎల్-480 విధానం, పైరు పచ్చ విప్లవం విధానాల అమలు, వీటి కొరకు సహాయమనేది... భారత వ్యవసాయ ప్రయోజనాలకు తోడ్పడకపోగా అమెరికాకు, విదేశీ పెట్టుబడిదారుల ప్రయోజనాలకు మాత్రమే తోడ్పడిందన్నారు. ఈ సహాయానికి ఆమోదముద్ర వేయడం తన దేశ ప్రయోజనాల

కోసమేనని ప్రకటించి అమెరికా అధ్యక్షుడు జాన్సన్ భారతదేశాన్ని తీవ్రంగా అవమానించాడని, భారత ప్రజానీకపు ఆకాంక్షలు, అభివృద్ధిపై ఆశలన్నీ భారత పాలకుల విద్రోహానికి గురయ్యాయనే టీఎన్ వక్కాణింపులనే, అశోకా మోడీ కూడా నిర్ధారించాడు.

అశోకా మోడీ ప్రత్యేక పదాలతో నిర్వచించకపోయినప్పటికీ, విదేశీ పెట్టుబడిపై ఆధారపడే స్థితి నుండి, ఇండియా ఈ 75 సంవత్సరాల స్వతంత్రం తర్వాత ఏ విధంగా అంతర్జాతీయ సామ్రాజ్యవాద మదుపరులైన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు పూర్తిగా లోబడిందో, కొద్దిమంది బడా పెట్టుబడిదారీ వ్యాపారులకు తప్ప, అన్ని విభాగాల ప్రజానీకపు పురోగతి యొక్క అవకాశాలను తిరిగి కోలుకోలేని స్థితికి చేర్చిందో వివరించారు. మన పాలకులు, పాలకవర్గాలు దేశ వనరులన్నింటిని, సహజ సంపదలన్నింటిని రానున్న పదుల సంవత్సర కాలానికి కూడా, విదేశీ ద్రవ్య పెట్టుబడి ప్రయోజనాలకు ఏ విధంగా కట్టబెట్టారో కామ్రేడ్ టీఎన్ నిరూపించి ఇలా పేర్కొన్నారు:

'తనలో దేశభక్తి ఈషణ్మాత్రమున్న ప్రతి పౌరుడు, అత్యంత సహజంగా ఈ విధమైన దిగజారుడు విధానాలకు వ్యతిరేకంగా, భారత ప్రజానీకపు, భారత జాతుల గొప్ప కీర్తి ప్రతిష్టలను పునరుద్ధరించడానికి తిరగబడి తీరుతాడు'

అశోకా మోడీ ప్రస్తుత భారతదేశ పరిస్థితి యొక్క ఒక న్యాయమైన చిత్రాన్ని, ఆయన విశ్లేషణ ద్వారా పాఠకుల ముందు ఉంచారు. దేశ ఆర్థిక చరిత్రను, భారతదేశ సమాజంపై దాని పర్యవసానాలను మొత్తంగా సరిగా అర్థం చేసుకునేందుకు, ఒక సరైన అంచనా ఏర్పరచుకొని నిజాయితీగా దేశభక్తియుత మార్గంలో, ఒక తపనతో సరైన విధానాలతో వ్యవహరించడానికి ఈ దేశ యువతకు ఈ పుస్తకం ఖచ్చితంగా సహకారిగా ఉంటుంది. ప్రత్యేకించి, 2024లో సార్వత్రిక ఎన్నికల ఈ సంధి సమయంలో ఈ పుస్తకాన్ని అధ్యయనం చేయడం, సరైన దృష్టిని, అవగాహనను ఏర్పరచుకోవటానికి దోహదపడుతుంది.

**(2024 ఏప్రిల్ 'క్లాస్ స్ట్రగుల్' నుండి అనువాదం)**

★★★★★